క్లుప్తంగా

గోడలపై పోస్టర్లు, రాతల తొలగింపు



పాన్‌గల్: 'నిబంధనల అమలులో నిర్లక్ష్యం' శీర్షికన ఆదివారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కేతేపల్లిలో గోడలపై ఉన్న రాతలు, పోస్టర్లను అధికారులు పారిశుద్ధ్య కార్మికుల ద్వారా తొలగింపజేశారు.

రావులకు సన్మానం

మదనాపురం: వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డిని ఆదివారం మండల జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలో కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. బీఆర్‌ఎస్‌లో రావుల చేరికతో దేవరకద్ర, వనపర్తి నియోజకవర్గాల్లో బలం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంనారాయణ, యాదగిరి, చాంద్‌భాషా, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



ఆత్మకూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ బూత్‌లలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మౌలిక వసతులను కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్‌బూత్‌ను ఎంఈఓ భాస్కర్‌సింగ్‌తో కలసి పరిశీలించారు. మున్సిపాలిటీ కార్మికులతో పోలింగ్‌బూత్‌లో విద్యుత్ పనులు, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి పనులు చేపట్టినట్లు తెలిపారు. 11 పోలింగ్‌బూత్‌లలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు

ఆత్మకూర్: పట్టణంలోని నాల్గవ వార్డు కుర్వవీధిలో తాగునీటి బోరు పని చేయకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ నాగరాజు ఆదివారం సిబ్బందితో కలిసి కొత్త మోటార్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. మున్సిపాలిటీ కేంద్రంలో తాగునీటి ఇబ్బందులు రానియకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పట్టణ ప్రజలకు సూచించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గోపాల్‌పేట: మండలంలోని తల్పునూర్‌తండాకు చెందిన ముడావత్ గోవిందుపై దాడికి పాల్పడిన తండా వాసి ముడావత్ తుల్చపై కేసు నమోదు చేసినట్లు రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. గోవిందు తల్లి రుకాలిని తుల్చ దూషిస్తూ దాడి చేసేందుకు యత్నించగా, అడ్డుకోబోయిన అతడిపై కర్రతో దాడి గాయపర్చినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం



చిన్నంబావి: మండలంలోని దగడపల్లికి చెందిన విద్యార్థిని శృతి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో సీటు సాధించినందుకు కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కల్యాణ్‌రావు ఆదివారం సన్మానం చేశారు. అనంతరం ఆమెకు రూ.50 వేల నగదు అందించారు. విద్యార్థికి ఎప్పుడు ఏ ఆపద ఉన్న తనను సంప్రదించాలని అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, చిదంబర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, విద్యాసాగర్‌రావు, రంజిత్‌కుమార్, బాలుయాదవ్, బాలకృష్ణ, చింతల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాల్వ షెట్టర్ల వద్ద పూజలు



అమరచింత: విజయదశమిని పురస్కరించుకుని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ షెట్టర్లకు ఆదివారం పీజేపీ అధికారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయుధ పూజలో భాగంగా ప్రతి సంవత్సరం పూజలను నిర్వహిస్తున్నామని డీఈ నారాయణ తెలిపారు.

దుర్గామాత పాహిమాం..



ఖిల్లాఘనపురంలో దుర్గామాతగా అమ్మవారు



వనపర్తి పట్టణం వెంగళరావుకాలనీలో పూజల్లో పాల్గొన్న మహిళలు

ఆత్మకూర్: దేవిశరన్నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీకన్యకాపరమేశ్వరి మాతా ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయంలో సహస్ర కుంకుమార్చన, హోమం, పల్లకీసేవ, మహామంగళ హారతి, ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు వివిధ భక్తి అంశాలపై పోటీలు నిర్వహించి ప్రతిభకనబర్చిన వారికి బహుమతులను అందజేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో అమ్మవారు ఆదివారం దుర్గామాతగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం, సాయంత్రం అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలను నిర్వహించారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, కుంకుమ అర్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మదనాపురం: మండలంలో మహిశాసురమర్ధిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

చిన్నంబావి: మండలంలోని పెద్దమారులో నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి అవతారంతో అమ్మవారు దర్శనం ఇచ్చారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణలంలోని వెంగళరావు కాలనీలో అమ్మవారిని ఆదివారం దుర్గామాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది.

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని కాళీకామాత ఆలయంలో హోమం నిర్వహించారు. అమ్మవారు ఆదివారం దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

డిపోలో ఘనంగా దుర్గామాత పూజలు

వనపర్తిటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం దుర్గామాత పూజలను ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ వేణుగోపాల్ అమ్మవారికి పూజలు నిర్వహించి, వాహన, ఆయుధ పూజలు చేశారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులందరికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.



మదనాపురంలో..



ఆత్మకూర్‌లో పూజల్లో పాల్గొన్న స్వర్ణకారుల



పాన్‌గల్‌లో పూజలు చేస్తున్న మహిళలు



అమరచింతలో..

స్వార్థ రాజకీయాలతో యువతకు అన్యాయం



మాట్లాడుతున్న కార్యదర్శి రాబర్ట్

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా స్వార్థ రాజకీయాలతో యువతకు అన్యాయం చేస్తున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సురేష్, సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వర్తక సంఘం భవనంలో ఏఐవైఎఫ్ ద్వితీయ జిల్లా మహాసభలు రెండో రోజు కొనసాగాయి. దేశంలో 60శాతం ఉన్న యువతను పాలకులు పట్టించుకోవడంలేదని యువత నైపుణ్యం, యువశక్తిని దేశానికి ఉపయోగించుకోవాల్సి ఉండగా ఉపాధి, ఉద్యోగాలు లేక పెడదారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు స్పష్టమైన హామీని ఇవ్వాలని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యువతను ప్రగతిశీల, అభ్యుదయ, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామ్య విలువలు పెంపొదించేందుకు ఏఐవైఎఫ్ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ వనపర్తి జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శిగా కుతూబ్, మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, అబ్రహం, రవీందర్, రఘు, మల్లేష్, శ్రీను, ఇబ్రాయిల్, ఎర్రన్న, నిసార్, కార్తిక్, సాయి, ఉదయ్ ఉన్నారు.

కుమురం భీంకు ఘన నివాళి



వనపర్తి టౌన్: ఆదివాసీల హక్కులను కాపాడటమే ఏకైక లక్ష్యంగా కుమురం భీం అలుపెరగని పోరాటాలు చేశారని ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. టీజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో కుమురం భీం జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నరసింహశర్మ, నాగరాజు, వెంకటస్వామి, నాగరాజు, బాలేమియా, పరమేశ్వరచారి, గంగాధర్ చారి, సత్యం చారి, కిరణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన దుకాణాలు



ఆత్మకూరు మార్కెట్‌లో రద్దీ

ఆత్మకూర్: దసర వేడుకలకు పట్టణ వాసులు సిద్ధమవుతున్నారు. ఆదివారం పట్టణంలో కిరాణం, బంగారు, దుస్తులు, స్వీట్లు, పూలు, గుమ్మడికాయలు ఇలా అన్ని దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. సోమవారం విజయదశమికి సంబంధించి కొనుగోళ్లు నిర్వహించారు. అలాగే మున్సిపాలిటీ పాలకమండలి ఆధ్వర్యంలో జాతర మైదానంలో జమ్మిపూజకు ఏర్పాట్లు చేశారు.



దుస్తులు కొనుగోలు చేస్తున్న పట్టణవాసులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు జెడ్పీహెచ్‌ఎస్ 2008-09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు సర్వారెడ్డి, మునయ్య, శ్రీనివాసులుశర్మ, శ్రీలతను సన్మానించారు. పాఠశాలకు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

సద్దుల బతుకమ్మ.. సల్లంగ చూడు



ఆత్మకూర్‌లోని భార్గవినగర్‌లో..



ఆత్మకూర్‌లో బతుకమ్మతో శివాజీనగర్ మహిళలు

ఆత్మకూర్: పట్టణంలోని భార్గవినగర్ కాలనీలో, వాసవీమాత ఆలయంలో, నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో, శివాజీనగర్ కాలనీ, వాల్మీకి నగర్‌లో ఆదివారం రాత్రి ఘనంగా బతుకమ్మ సంబరాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడి పాడుతూ ఊరేగింపుగా వెళ్లి పరమేశ్వరస్వామి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

అమరచింత: పట్టణంలోని దశమికట్ట వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. పట్టణంలోని వివిధ వార్డుల నుంచి మహిళలు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపురంలో ఆదివారం మహిళలు, చిన్నారులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.

పాన్‌గల్: బతుకమ్మ సంబరాలను శాగాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా గ్రామ సమీపంలోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

కొత్తకోట రూరల్: సద్దుల బతుకమ్మ సల్లంగా చూడంటూ మహిళలు ఆడిపాడారు. ఆదివారం రాత్రి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సంబరాలు ఘనంగా నిర్వహించారు.



ఆత్మకూర్‌లో కన్యకపరమేశ్వరి ఆలయంలో కోలాటం



అమరచింతలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు



పెబ్బేరు మండలం రాంపురంలో..



పెద్దమందడి మండలం అమ్మపల్లిలో..

గడప గడపకు సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు వివరించి ఓట్లు అడగాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు విభేదాలు పక్కనబెట్టి అందరూ సమష్టిగా సమన్వయంతో పనిచేస్తూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రామన్నగట్టు రిజర్వాయర్‌తో అన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని.. నాలుగేళ్లుగా సీఎం కేసీఆర్ సహకారంతో అన్నిరంగాల్లో ముందుకు నడిపిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వారికి లీగల్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన ఘనత జూపల్లిదని.. మాజీ మంత్రిని శాశ్వతంగా మాజీ చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి ఓట్లు వేస్తే రాష్ట్రాన్ని అమ్ముకుంటారని.. ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని.. కొల్లాపూర్‌లో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనేనని వివరించారు. కార్యక్రమంలో అభిలాష్‌రావు, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోంనాథ్‌నాయక్, వెంకటయ్యనాయుడు, రాముయాదవ్, రామ్మూర్తినాయుడు, చంద్రశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం



అల్లమాయపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి, రోడ్డుమీదితండాలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు.

పెబ్బేరు రూరల్: పెబ్బేరు ఉమ్మడి మండలంలోని వెంకటాపురం, సూగూరు, నాగసానిపల్లి, బునాదిపురంలో బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వనపర్తి మండలంలోని కడుకుంట్లలో బీఆర్‌ఎస్ నాయకులు మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ముదిరాజ్ నాయకులు

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం పెబ్బేరు పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన ముదిరాజ్ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ప్రజాక్షేమం కోసమే ఆరు గ్యారంటీలు



అమరచింతలో ప్రచారం చేస్తున్న నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన వారితో జూపల్లి కృష్ణారావు

అమరచింత: ఆరు గ్యారంటీల పథకాలతో నియంత పాలనను తరమికొట్టేందుకు ప్రజలందరూ కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరముందని టీపీసీసీ రాష్ట్ర గౌడ సంఘం చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. తిరగబడదాం- తరమికొడదాం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఐదో వార్డులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మక్తల్ నియోజకవర్గంలో ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, రహదారులను సైతం వేయలేని స్థితిలో ప్రజాప్రతినిధులు ఉన్నారన్నారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఇప్పటి వరకు నియోజక వర్గంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించలేని ఎమ్మెల్యే ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో అయ్యుబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, హనుమంతునాయక్, తౌఫిక్, నాగునాయక్ పలువురు పాల్గొన్నారు.

పాన్‌గల్: కాంగ్రెస్ పార్టీ అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలను గడప, గడపకు వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కిష్టాపూర్‌తండా సర్పంచ్ దేవీసింగ్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఆత్మకూర్: పట్టణంలో ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నగదుకు సంబంధించిన పూర్తి స్థాయిలో ధ్రువపత్రాలు ఉండాలని తెలిపారు.

యువకుడు మృతి



వెంకటేష్ (ఫైల్)

వీపనగండ్ల: పొలంలో పురుగు మందు పిచికారి చేసిన అనంతరం అస్వస్థతకు గురై యువకుడు మృతి చెందిన ఘటన ఆదివార మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. గోవర్ధనగిరికి చెందిన హరిజన్ వెంకటేష్ (26) గ్రామంలోని ఓ రైతుల పొలంలో పురుగు మందు పిచికారి చేసేందుకు కూలి పనికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు.

ఆర్యవైశ్యుల సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని భారత జాతీయ మహిళ సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కేతేపల్లిలో పేద ఆర్యవైశ్యులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని, గ్రామంలో రోడ్డు విస్తరణలో జీవనాధారమైన దుకాణాలు కోల్పోతున్నారని, నష్టపరిహారం లేదా స్థలం ఇచ్చి షాపుల నిర్మాణానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పండుగ వేళా.. పూల సందడి

మదనాపురం: జిల్లాలోని వనపర్తి, వీపనగండ్ల, శ్రీరంగాపురం, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత, మదనాపురం, గోపాల్‌పేట మండలాల్లో పూలతోటలు సాగు చేశారు. గతంలో అతి వృష్టి అనావృష్టితో నష్టపోయిన రైతులు అలాంటి వాటికి తావివ్వకుండా పండుగ సీజన్‌లో డబ్బులు ఎక్కువ వస్తాయన్న ఆలోచనతో పూల తోటలు సాగుచేశారు. ప్రధానంగా బతుకమ్మ, దసరా, దీపావళి పండుగతో ఈ పూల సాగు అధిక లాభాలను తెచ్చిపెడుతుంది. ఒక్కొక్క రైతు ఎకరా, అరెకరం, పావు ఎకరంలో బంతిపూల తోటలు సాగు చేస్తున్నారు. రూ 20వేలు పెట్టుబడి పెడితే రూ.లక్ష వరకు లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా పూల తోటకు నీటిని పారబెడుతూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. కేవలం 100 రోజుల్లోనే 15 నుంచి 20 సార్లు పూలను తెంచుకోవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం బతుకమ్మ సీజన్ ప్రారంభం కావడంతో బంతిపూలకు విపరీతమైన డిమాండ్ ఉందని చెబుతున్నారు. కిలో రూ. 50 చొప్పున విక్రయిస్తున్నామని, కావల్సిన వారు తోటకి వచ్చి తీసుకెళ్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.